# జాలిమారాజు

ఇద్దరూ బస్టేండు చేరుకునేసరికి పిట్టమనిషిలేడు. ప్రైవేటు రంగంగాడైతే లైటార్పేసి పడుకుంటాడు. ఆర్టీసీ వాడుకదూ లైటార్పకుండానే పడుకున్నాడు. మరంచాత బస్టేండు పట్టపగల్లాగుంది.

ఇద్దరూ వారం క్రితంవొచ్చేరిక్కడికి ఉజ్జోగం కోసం. ఆ సంగచ్చాలు మరంతకంటే ఎక్కువ చెప్పక్కర్లేదు. ఎక్కడికి తిరిగినా దొరకందదేననీ, తెచ్చింది ఖర్చయిపోగా తిండానికేవీ లేక, తిరిగిపోవడానికి ముఖం చెల్లక తిరుగుళ్ళు తిరుగుతున్నారనీ - కూలైనా దొరికితే చాలనే స్థితిలో ఇప్పుడున్నారనీ... చెప్పాలా? అక్కర్లేదక్కర్లేదు. ఇప్పుడిద్దరి గెడ్డాలూ పోటీ పడ్డట్టు మాసి వున్నాయి. వాళ్ళ బట్టలు పోటీ పడకముందే మాసిపోయున్నాయి.

"కడుపులో కంఫర్టబుల్లా లేకపోయినా.. ఇక్కడ చాలా కంఫర్టబుల్లా ఉంది..." ఓ బెంచీ మీద ఉస్సున ఊదుకుని కూర్చున్నారు.

చుట్టూ చూసేరు. ఎవ్వరూ లేకపోవడం చికాకు కలిగించింది. "ఎవళ్తోటైనా దెబ్బలాట పెట్టేసుకుందా వంటోంది ఆకలి..." అన్నాడు మొదటివాడు.

"ఓ పన్జేద్దావా... మనిద్దరవే దెబ్బలాడీసుకుందాం... ఆకలి చల్లారకపోయినా ఆవేశం చల్లార్తుంది...?" అన్నాడు రెండోవాడు.

"ఒద్దులే..." అని బెంచీమీద చేరబడ్డాడు. మరో బెంచీ మీద రెండో వాడూ చేరబడ్డాడు. ఆపైన అక్కడే ఆకలి నిద్రకి దాసులయ్యేరు.

★ ★ ★

డిప్యూటీ మంత్రిగారు జిల్లా పర్యటనకొచ్చేరు. స్వంత జిల్లాలో మూడు రోజులు ముమ్మరంగా పర్యటించేరు. జిల్లా హెడ్క్వార్టర్సు నుండి ఇప్పుడు బస్సులో ఛలో హైద్రాబాద్! అర్ధరాత్రయిపోయింది కాబట్టి ఇప్పటికిదే పేపర్ న్యూస్‌కి వెళ్ళింది.

జిల్లా కలెక్టరుగారు మూడు రోజులుగా వార్ని ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం వారి కార్లోనే మంత్రిగార్ని బస్టేండుకు జేరేసి వీడ్కోలు చెబుదామని స్వయంగా డ్రైవు చేస్తున్నారు.

"ఉజ్జోగాల్దొరకనోళ్ళంతా... రిజర్వేషన్ల మీద బడేడుత్తారేంటి? అక్కడికి మనవేటో రిజర్విసన్సు మాకరక్టిగా అమలు జేసీస్తన్నట్టూ.. ఏటి జగన్నాధం..... ఏటంటా?"

"నిజవేన్సార్..."

"ఉప్పుడు సూడు. మంజిల్లాయే ఉంది. ఒక్కేబినెట్టు మినిస్ట్రీ రిజర్వు సేసేసేరు. సీనియరోళ్ళంతా డిపాజిట్లు గల్లంతు సేన్కుంటే మర్నాకియ్యాలగదా. ఇస్తే సీనియరోళ్ళంతా జిల్లా ఓల్ మొత్తం గోల్మాల్ సేసీత్తారు. యివ్వకపోతే నేన్జేసీస్తాను. మరంచాత డిప్యూటీ మినిస్ట్రీ పారేసేరు. మరేటి రిజర్విసను పాటించీసింది మన ప్రెబుత్వం.... ఏటి జగన్నాధం?"

"అవున్సార్..."

"నీ మట్టుకు నిన్నే సూడు... పర్లేదులే మన్లో మనమాట... ఈ జిల్లాకి రిజర్విసను కోటా నిండికదా కలెక్టర్నెయ్యాల. మరి ఎలక్సన్లంట నీ జీపులిచ్చీ, లారీలిచ్చీ, మందినిచ్చీ నివ్వు సాయంజేత్తేకద.... ఈ పోస్టు కెవ్వడూ రిజర్విసను కేండేట్టు రాలేదన్జెప్పి ఓపిన్ కేండిట్టు ఒవుణ్ణన్నా ఏసియ్యొచ్చునని కాయితమ్ముక్క తెచ్చుకుని నిన్నుంచీసుకున్నాంకాదూ జగన్నాధం... మాటాడవేటి... ఇదంతా ఎందుకంటే... యిందాకలసూడు మీటింగుల కుర్రకారు కూతలూ..."

"అవున్సార్... అన్నీ నిజవేగాని మనవలాంటి మాటలు పొరపాట్న కూడా జారకూడదన్సార్... అణచివేతకి గురౌతున్న వాళ్ళకి చేయందించి లేవనెత్తటానికే రిజర్వేషన్లు... నిరుద్యోగుల నిరాశానిస్పృహలు పారద్రోలటానికే నిరుద్యోగభృతీ, ఉద్యోగావకాశాలు కల్పించడం..."

"మా బేసుగ్గా చెప్పేవు జగన్నాధం... ఆ ముక్కలే ఓ కాయితమ్ముక్క

మీద రాసేసి నాటూరు పోగ్రాంమీద నేనిచ్చినట్టుగా ఓ స్టేట్మెంటిచ్చేమి..." జిల్లా స్థితిగతుల్ని జిల్లా కలెక్టరుతో చర్చించి, పరిశీలించి సమీక్షించి మర్నాటి వార్తాపత్రికల క్కావలసిన మేటరు కార్లోనే సిద్ధం చేయించేరు.

★ ★ ★

"రెండ్రూపాయి లొచ్చేయిరా...

బస్సుకొనుక్కొచ్చి టీనీళ్ళు తాగుదాం పద...." అన్నాడు మొదటివాడు.

హైద్రాబాదు వెళ్ళే బస్సు పల్చగా ఉంది. అయిదారుగుర్ని మించి లేరు. అందులోనే ఎవరికో కూల్చేసి సంపాయించేడు రెండ్రూపాయలూ.

"ఓ గడియుంటే.. మరో బేరవేనైనా తగిల్తే రేపంటూ ఉంటాది కదా..." అన్నాడు రెండోవాడు ఆశగా హైద్రాబాద్ బస్సుని చూస్తూ.

జాలేసింది ఒకరిమీద ఒకరికి. జేబులోని నలిగిపోయిన డిగ్రీ కాగితమ్ముక్క పుచ్చుకొని పోర్టరు లైసెన్సు బిళ్ళన్నా సంపాయిస్తే బాగుణ్ణు అన్పించింది ఒక్క క్షణం. ఒక్కసారి తల విదిలించుకుని "పద్పద..." అంటూ ఒకర్నొకరు తరుముకున్నారు దూరానున్న టీకొట్టులోకి.

కలెక్టరుగారు నడుపుతున్న కారు ముందూ, ఆ వెనక సవినయంగా పోలీసు జీపూ ఒచ్చి ఆగేయి.

కార్లోంచి కలెక్టరుగారూ, జీపులోంచి ఓ సర్కిలూ, మరో ఎస్పయ్యా ఇద్దరు కానిస్టేబుల్సూ దిగేరు. కాని మంత్రిగారు మాత్రం దర్జాగా కూర్చునే ఉన్నారు.

"అయ్‌గారి సామాను బస్సుమీద వేయించేసెయ్యండి..." అన్నారు కలెక్టరుగారు సర్కిలుగారితో. మరింకేం కానిస్టేబుల్సిద్దరూ అలవాటు పడ్డ జాగిలాల్లా ముందుకురికేరు.

కాని ఇంతలో...

"జగన్నాధం..." అంటూ మంద్ర స్వరంతో మంత్రిగారి మందలింపు

వినిపించింది. 'నువ్వేచెప్పేవుకదా... అధికార దుర్వినియోగం చెయ్యొచ్చునా... ఇంత పబ్లిగ్గా' అన్నట్టుగా కళ్ళు అరమూసి తెరిచి, సగం నవ్వు నవ్వేరు మంత్రిగారు.

అర్థం చేసుకుని, బెదురుగా హైద్రాబాద్ బస్సులోని అయిదారుగురు ప్రయాణీకుల్ని చూసేరు కలెక్టరుగారు. "అటెక్కడైనా పోర్టర్సుంటారేమో పిలుచుకురండి..." అన్నారు.

"ఇళ్ళల్లో అంట్లుతోవించి నా కొడుకులేటి సామాను మొయ్యింపించడానికి మొగమాట పడ్తున్నారేటి అని ఒక్కక్షణం బిత్తరపోయి, మళ్ళీ వెంటనే బూట్లు రెండూ 'టకాల్' మనిపించి సెల్యూట్ చేసి కదిలేరు కానిస్టేబుల్సు.

టీ కొట్లో టీ తాగుతున్న నిరుద్యోగులిద్దర్నీ లాక్కొచ్చారు.

"ఒహట్రెండ్మూడు... ఎనిమిది"అని లెక్కపెట్టి "శాల్తీకి రూపాయి యిప్పించండి" అన్నాడు మొదటివాడు.

గుప్పున మండింది కోపం.

"ఎంతో కొంతిస్తార్లే... చెప్పిన పన్జెయ్యండోయ్..." అని గద్దించేరు కల్టెరు గారు.

"అలా కాదండి... ఇంత రాత్రివేళ ఆపాటి కూలీ లేకపోతే ఎలాగండీ..." వేడి వేడి టీనీళ్ళు చల్లచల్లగా మాటాడించేయి రెండో వాడిచేత.

"అసలు లైసెన్సుడు పోర్టర్సేనా మీరిద్దరూ... మాటాడరేం... కాదు... అవునా? చెప్పినపని చేసి ఇచ్చింది పుచ్చుకుని వెళ్ళండి..." అన్నారు కలెక్టరుగారు.

కదల్లేదిద్దరూ. సర్కిలుగారు కనుసైగ చేసిన మీదట ఎస్పెయ్‌గారు వాళ్ళదగ్గరికి వచ్చి... "మంత్రిగారూ... కలెక్టరుగారూనూ... చెయ్యండోయ్... పర్లేదు..." అన్నారు గుసగుసగా.

ఎనిమిది శాల్తీలూ బస్సెక్కిపోయాయి. తొమ్మిదో శాల్తీ కూడా బస్సులో రిజర్వుడు సీటెక్కి కూర్చుంది. కిటికీలోనుండి రెండ్రూపాయిల నోటు

విసిరేరు మంత్రిగారు.

బస్సు లాంగించేసింది.

మరంచేత ఇద్దరూ కలెక్టరుగారి వెనకపడ్డారు... "సార్ పోనీ మరో రెండ్రూపాయి లిప్పించండి సార్" అంటూ.

"వాట్స్ దిస్ న్యూసెన్స్?" విసుగ్గా అంటూ సర్కిలుగారి వైపు చూసేరు కలెక్టరుగారు. అంతే, మొదటివాడు కలెక్టరు గారి మీది మీదికి వెళ్లిపోయి "ఈజ్ దిస్ నాట్ ద స్ట్రగుల్ ఫర్ ద రైట్?" అని అరిచేడు.

కారెక్కిపోయి.... "ఓ ఎడ్యుకేటెడ్ ఫూల్?" అంటూ ఇంగ్లీషు స్టయిల్లో ఆశ్చర్యపోయి... "టేకెదెమ్ అవే అండ్ డీల్ దిస్ కేస్..." అంటూ సర్కిలుగారి నాజ్ఞాపించి కలెక్టరుగారూ దూసుకుపోయేరు. ఒక ఐదు నిమిషాలాగి... "సుబ్బారావ్" అంటూ పిల్చి, వాళ్ళిద్దర్నీ చూపించి, జీపు మీద లాంగించీసేరు సర్కిలుగారు.

కారు దూసుకుపోయిన తోవని కాల్చి భస్మం చేసేలా చూస్తున్న వాళ్ళిద్దరూ, జీపు వెళ్ళిన తోవని దీనంగా చూస్తున్న ముగ్గురూ మిగిలేరు.

"ఎంటి కతా...?" ముందుగా తేరుకున్నాడు సుబ్బారావెస్సయ్.

"ఏంటీ లేదూ... డీల్ దిస్ కేసన్నాడు కదా కలెక్టరు... అంటే మరి కుళ్ళబోడిసీడవే..." అన్నాడు మొదటివాడు వెటకారంగా.

"సూడండి... పాతికేళ్ళు సర్వీస్లేసీ నానెస్సయ్యినయ్యేను... పెద్దోణ్ణి. సెప్తున్నాను. మీరు కుర్రోళ్ళు. ఆకల్తో ఉన్నారు. ఒకటి సెప్తాను ఆలకించుమీ... ఆకలి కన్నా మానం.. ఏటి ఆత్మాభిమానం ముఖ్యం. దాన్ని దెబ్బదీసేడనికదా నివిందాకల అరిసినావు. అలాంటి ఆత్మాభిమానాన్నే మేవెప్పుడో వొగ్గీసినాం.... కాకపోతే సూడండిందాకల సామాను బస్సులెయ్యమనగానే బేపిల్లా పరిగెట్టేరు మా జమాన్లిద్దరూ.... పెజలకి జడిసో పబ్లిక్కి బెదిరో మీ ఇద్దర్నీ పిలిపించి రెండ్రూపాయలైనా సేతులెట్టి పన్జేయించుకున్నారు. మీర్రాకపోతే ఉట్టినే

కూల్చేయించుకునీ నాలుగు బూతుల్తిట్టి మమ్మల్ని కసిరీద్దురు. మరందుకు మీకు టేంక్సు చెప్పేసి ఒగ్గీస్తన్నాను.... ఎళిపోండెళిపోండి..." అన్నాడు సుబ్బారావెస్సయ్.

"జీపు తోలికెల్లిపోయేడ్నాకొడుకు... మనకి లెప్టురైటేగావాల... పదండ్రా" అంటూ ముగ్గురూ అక్కడి నుండి కదిలేరు.

(స్వాతి మాసపత్రిక, డిసెంబర్ 1982)